# శ్రీ కోన ప్రభాకరరావు

శ్రీ కోన ప్రభాకరరావు ఆరవ శాసనసభ (1978-1983) స్పీకరుగా 1981వ సంవత్సరం ఫిబ్రవరి 24వ తేదీన ఏకగ్రీవంగా ఎన్నికై 1981వ సంవత్సరం సెప్టెంబరు 22వ తేదీ వరకు ఆ పదవిలో కొనసాగారు. వీరి హయాంలో 1981వ సంవత్సరంలో రెండవసారి అఖిల భారత స్పీకర్ల సదస్సు హైద్రాబాదులో జరిగింది.

వీరు 1916వ సంవత్సరం జూలై 10వ తేదీన గుంటూరు జిల్లా బాపట్లలో జన్మించారు. గుంటూరులోని ఆంధ్ర క్రిస్టియన్ కాలేజీలో బి.ఎ. డిగ్రీని, తదుపరి పూనాలోని లా కాలేజీ నుండి ఎల్.ఎల్.బి. డిగ్రీని పూర్తి చేసారు. కొంత కాలం న్యాయవాదిగా పనిచేశారు.

వీరు 1967వ సంవత్సరంలో నాల్గవ శాసనసభకు, 1972వ సంవత్సరములో ఐదవ శాసనసభకు, 1978వ సంవత్సరములో ఆరవ శాసనసభకు గుంటూరు జిల్లా బాపట్ల నియోజకవర్గం నుండి ఎన్నికైనారు.

శ్రీ ప్రభాకరరావు, శ్రీ భవనం వెంకట్రామ్ మంత్రి వర్గంలో ఆర్థిక ప్రణాళిక, చిన్న మొత్తాల పొదుపు, లాటరీలు, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రిగా 28.02.1982 నుండి 20.09.1982 వరకు, శ్రీ కోట్ల విజయభాస్కర రెడ్డి మంత్రి వర్గంలో ఆర్థిక ప్రణాళికా శాఖ మంత్రిగా 20.09.1982 నుండి 09.01.1983 వరకు పనిచేసారు.

సభాపతిగా పనిచేసిన కాలంలో అత్యంత విలువైన రూలింగులు ఇచ్చారు. ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్సు స్థానే శాసనసభలో బిల్లును ప్రతిపాదింపగోరే సమయంలో ఆ ఆర్డినెన్సును ఏ కారణాల వల్ల జారీ చేయవలసి వచ్చిందో తెలియజేస్తూ ఒక వివరణాత్మక పత్రాన్ని ఎటువంటి పరిస్థితులలోనైనా ఖచ్చితంగా జతచేయవలసి ఉంటుందని శ్రీ కోన ప్రభాకర రావు 1981, మార్చి 2వ తేదీన ఇచ్చిన రూలింగులో విశదీకరించారు.

వీరు పాండిచ్చేరి, సిక్కిం రాష్ట్రాల లెఫ్టినెంట్ గవర్నర్‌గా, మహారాష్ట్ర గవర్నర్‌గా పనిచేసారు.

సౌమ్యుడు, స్నేహశీలి, కళాకారుడు అయిన శ్రీ ప్రభాకరరావు 1990వ సంవత్సరం అక్టోబరు 10వ తేదీన మరణించారు.

## శ్రీ కోన ప్రభాకరరావు స్పీకరుగా ఎన్నికైన సందర్భంగా చేసిన ప్రసంగం

సభానాయకులు అంజయ్యగారు, ప్రతిపక్ష నాయకులు సుందరయ్యగారు, లచ్చన్నగారు, జైపాల్‌రెడ్డిగారు, రాజేశ్వరరావుగారు, వెంకయ్యనాయుడుగారు, మిత్రులారా ఈ కార్యక్రమానికి దాదాపు రెండు గంటలు పట్టింది. ఒకప్పుడు నేను కూడా ఇలాగే ఇక్కడ కూర్చున్న సభాపతిని శ్లాఘిస్తూ మాట్లాడిన వాడినే. ఒక ప్రముఖ న్యాయవాదిని నీవు హైకోర్టు జడ్జిగా వెడతావా అని అడిగితే ఆయన ఒక సమాధానం చెప్పాడు. ఎంత సమయం అయినా సరే నా ఇష్టం వచ్చినట్లు మాట్లాడటానికి నాకు ఓపిక వుంది కాని ఇంకెవరో నాలుగు గంటలు మాట్లాడితే వినడం కష్టం అని సమాధానం ఇచ్చాడట. నా గురించి రెండు గంటల నుండి చెబుతూవుంటే కొద్ది బాధగా వుందనుకోండి అయినా తప్పదు. నన్ను ఈ స్థానానికి ఏకగ్రీవంగా ఎన్నుకొన్నందుకు మీ అందరకూ నా నమస్కారాలు. నన్నుగురించి మాట్లాడుతున్న సందర్భంలో మిత్రులు జైపాల్‌రెడ్డిగారు ఒక మాట అన్నారు. "Like the Tower of Pisa, you may lean but do not fall" అని. నేను వారికి ఒక మాట మనవిచేస్తున్నాను. I may appear to lean but I do not lean. So I do not fall అని. అధ్యక్షస్థానంలో వున్నవారు ప్రతిపక్షం వైపు చూస్తారు, స్వపక్షం వైపు చూడరనే గ్రీవెన్స్ ఒకటి వుంది. ఇదివరకు ఎట్లా వున్నదో ఏమో కాని ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఆ మూల నుండి ఈ మూల వరకూ స్వపక్షం వారు వున్నారు.

పూల సుబ్బయ్యగారు ఒక ముఖ్య విషయం చెప్పారు. ఇది చాలా కాలంగా చాలామందిని వేధిస్తున్న సమస్య. అధ్యక్షుడు అయిన వారు పార్టీ నుండి రాజీనామా చేసి ఏ పార్టీకి చెందనివాడుగా వుండాలా లేక పార్టీలో వుంటూనే నడిపించవచ్చునా అనేది ఆ సమస్య. కన్వెన్షన్స్ అటూ ఇటూ కూడ వున్నాయి. ఒక ఐడియాలజిని నమ్మిన వ్యక్తి ఆ పార్టీకి రాజీనామా చేసినంత మాత్రాన వాటిని నమ్మకుండా వుంటాడనేది తప్పు. సూత్రప్రాయంగా రాజీనామా చేసినా నడిచే నడకలో ఏపార్టీనుండి వచ్చారో దానిని బలపరిస్తే అది హిపోక్రసి అవుతుంది కాని మరొకటి కాదు. నేను చాలాకాలం ఎడ్వకేటుగా పనిచేశాను. ఎడ్వకేట్ వృత్తిలో వున్న గొప్పదనం ఏమిటంటే అబ్జెక్టివ్‌గా నడవాలి. సక్సెస్‌ఫుల్

కావాలంటే అబ్జెక్టివ్‌గా పని చేయాలి. సబ్జెక్ట్‌ను అబ్జెక్టివ్‌గా తీసుకొని, పార్టీ రహితంగా, పార్టీకి అతీతంగా సమస్యలను పరిష్కరించటానికి ప్రయత్నం చేస్తానని హామీ ఇస్తున్నాను. నాపై గురుతరమైన బాధ్యత వుందని అనుకుంటున్నాను. ఈ నాలుగు గోడల మధ్య వున్న ఈ సభకు అధ్యక్షుడుగా వున్న వ్యక్తికి తిరుగులేని అధికారం వుంది. హైకోర్టు జడ్జి కంటే ఎక్కువ అధికారాలు వున్నాయి. హైకోర్టు జడ్జి తప్పు చేస్తే దానికి అప్పీలు వుంది, డివిజన్ బెంచికి పోవచ్చు. ఇక్కడ అధ్యక్షుడు తప్పు చేస్తే దానికి అప్పీలు లేదు. ఏదైనా నిర్ణయం చేసేటప్పుడు గురుతరమైన బాధ్యత అధ్యక్షుని పై వుందని నేను గుర్తించాను. ఆ మాదిరిగా వ్యవహరించటానికి నేను ప్రయత్నం చేస్తానని హామీఇస్తున్నాను. కొత్త పంథాను త్రొక్కుతామా అన్న ఆలోచన అప్పుడప్పుడు వస్తూవుంటుంది. ఇక్కడ జరిగే కార్యక్రమాలకు సంబంధించి స్పీకరు ఒక రిఫరి. సక్రమంగా, ప్రశాంత వాతావరణంలో ఈ సభను నడపడంలో స్పీకరు డ్యూటీస్ పరిమితంగా వున్నాయి. అయితే నేను అనుకుంటున్నాను, రాజకీయంగా అనేక పార్టీలవారికి, వారి వారికి వున్నటువంటి ఐడియాలజీస్, వున్నా అందరి ధ్యేయం సమాజములో ప్రతి మానవుడియొక్క శ్రేయస్సును దృష్టిలో పెట్టుకునే చేస్తున్నామని చెబుతున్నారు గాబట్టి ఒక చోట కాంగ్రెస్ ప్రభుత్వం రావచ్చు, యింకొక చోట కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వం రావచ్చు, మరొక చోట లోక్‌దళ్, యింకొక చోట బి.జె.పి రావచ్చు, ఎవరు వచ్చినా ఎవరు చెప్పినా మా కార్యక్రమం ప్రకారం మేము అనుకున్న పంథా ప్రకారం ప్రజలకు శ్రేయస్సు చేకూరుతుందని, ఆ అభిప్రాయముతోనే ప్రజలనుండి ఓట్లు తెచ్చుకున్నామని, ప్రజలు మన మనస్సులను నమ్మి, మన మంచిని నమ్మి ఓట్లు యిచ్చారు. ఈ అయిదు సంవత్సరాల కొరకు ఏ ప్రభుత్వాన్ని అయితే ప్రజలు పంపారో ఆ ప్రభుత్వం యొక్క మ్యానిఫెస్టో అమలుపరచి, అవకాశం కల్పించి వారి శ్రేయస్సుకు పూనుకున్నప్పుడు వారు చేప్పే సూత్రాలను నమ్మడానికి అవకాశం వుంటుందని నా అభిప్రాయం. కానప్పుడు, ప్రజలు చూశారా మేము సహకరించాము, అయినా వారు చేయలేకపోయారు అంటారు. ప్రభుత్వానికి వచ్చిన మరునాడు నుండే యీ ప్రభుత్వం ఎట్లా పోవాలని అనేక వాదనలు వస్తే ఎప్పటికప్పుడు మనస్పర్ధలు, తగాదాలు వస్తే, అవి తగాదాలుగానే మిగిలిపోతున్నాయి. ప్రజలను మరచిపోతున్నాము. ఈ పద్ధతిలో గాకుండా నేను అనుకుంటున్నాను. నాలుగు గోడల

మధ్యకంటే ప్రజలయొక్క సమస్యలు క్లిష్టమైనటువంటి సమస్యలు అపూర్వమైనటువంటి వాతావరణములో వచ్చినప్పుడు అన్ని పార్టీల మధ్యన అవగాహన తీసుకువచ్చి సరైన శాంతి మార్గంలో పరిపాలన సాగేలా చేయడం మంచిది. బయట అల్లర్లు, సభలో అల్లర్లు జరుగుతూవుంటే ప్రజాస్వామ్య సూత్రాలపైన ప్రజలకు విశ్వాసం పోయే పరిస్థితి వస్తుంది. అందుకని అందరి బాధ్యత దీని మీద వుంది. ఇక్కడకు ఎన్నిక అయి వచ్చిన ప్రతివాడు రెండు లక్షల మంది ప్రజలకు ప్రతినిధి. తక్కువ వాడు యిందులో లేడు, నాకు స్వపర భేదం లేదు, నేను  చూపించను, చేయను. సంవత్సరంలో మనం కలిసేది 90 రోజులు. అందులో 20 రోజులు ఏదో కారణంగా సెలవులు పోతున్నాయి. యాక్చువల్‌గా కలిసేది 70 రోజులు. ఈ కార్యక్రమాలను డిస్ప్లిన్‌గా చేసుకుంటే ప్రతివారికి సావకాశం రావడానికి ప్రయత్నం చేస్తాను, నాకు ముందు వున్న స్పీకర్సు చాలా పేరు ప్రతిష్టలు సంపాదించారు. నేను సక్సస్‌ఫుల్ స్పీకరు కావాలంటే, సక్సస్‌ఫుల్ స్పీకరుగా పేరు తెచ్చుకోవాలంటే అది నా చేతిలోలేదు. మీ మీద వుంది.  ఎంతవరకు సక్సస్‌ఫుల్ చేయడానికి మీకు ఉత్సాహం వుందో అంతవరకు సక్సస్‌ఫుల్ అవుతాను. నేను తెల్ల కాగితములాంటి వాడిని, మీరు మంచి వ్రాస్తే మంచి వుంటుంది, చెడు వ్రాస్తే చెడు వుంటుంది. ఆ బాధ్యత మీకు వదలిపెడుతున్నాను. మీరు నా గురించి ఎన్నో మంచి విషయాలుచెప్పారు దానికి తగినా తగకపోయినా మీకు నా థ్యాంక్సు చెబుతూ సెలవు తీసుకుంటున్నాను.